మన
ప్రశ్నించడం కోసం...?
ప్రజా ప్రతినిధి
RNI NO. TELTEL/2023/90455
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
తెలుగు దినపత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :269 శనివారం జూలై 25 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# భారత్ అభివృద్ధిలో భాగస్వాములు కండి రాష్ట్రపతి

- ●భారత్‌రొమేనియా వ్యాపార వేదికలో ద్రౌపది ముర్ము
- ●పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యానికి ఆహ్వానం
- ●'వికసిత్ భారత్2047' లక్ష్యాలను వివరించిన రాష్ట్రపతి




బుఖారెస్ట్ (రొమేనియా), జూలై 24 (మనప్రజాప్రతినిధి): భారత్‌రొమేనియా ద్వైపాక్షిక ఆర్థిక, పారిశ్రామిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రొమేనియా రాజధాని బుఖారెస్ట్‌లో నిర్వహించిన భారత్‌రొమేనియా వ్యాపార వేదిక సమావేశంలో పాల్గొన్నారు. రొమేనియా అధ్యక్షుడు నికుషోర్ డాన్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి రొమేనియా ప్రభుత్వ ప్రతినిధులు, ఇరు దేశాల ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాల్సిన అవసరాన్ని రాష్ట్రపతి ప్రస్తావించారు. సమావేశంలో ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, "వికసిత్ భారత్2047" లక్ష్యంతో భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు వేగంగా ముందుకు సాగుతోందని




తెలిపారు. స్వాతంత్ర్య శతాబ్ది నాటికి దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ఈ దార్శనిక లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ప్రయాణం ప్రపంచ దేశాలకు, ముఖ్యంగా భాగస్వామ్య దేశాలకు పెట్టుబడులు, వ్యాపార విస్తరణ, సాంకేతిక సహకారానికి విస్తృత అవకాశాలను కల్పిస్తుందని వివరించారు. భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాలు, తయారీ రంగం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ఆవిష్కరణల ఆధారిత 2

# కాంగ్రెస్ పాలనపై హరీశ్‌రావు విమర్శలు



- ▫సాగునీరు, తాగునీరు, విద్యుత్‌లో ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ
- ▫సోలీపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ
- ▫రైతులకు 24 గంటల విద్యుత్ ఇవ్వాలని డిమాండ్

2

# డీపీవీ హైస్కూల్‌ను ప్రారంభించిన భట్టి

- -మణుగూరులో నూతన విద్యాసంస్థ ప్రారంభం
- -నాణ్యమైన విద్యతో భావితరాలకు బలమైన పునాది
- -విద్యా మౌలిక వసతుల బలోపేతానికి ప్రభుత్వ కట్టుబాటు



2

# ఖమ్మం తాగునీటిపై అప్రమత్తంగా ఉండాలి

- -ఏన్కూర్ రెగ్యులేటర్ వద్ద జలాల ప్రవాహాన్ని పరిశీలించిన భట్టి
- -ఏ గ్రామంలోనూ తాగునీటి కొరత రాకుండా అధికారులకు ఆదేశం
- -ప్రజలకు నిరంతర తాగునీటి భద్రతే ప్రభుత్వ లక్ష్యం



2

# కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

- -ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో కుటుంబ సభ్యుల సమక్షంలో ఆశీర్వాదం
- -గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌కు మద్దతుగా మొక్క నాటిన కుటుంబ సభ్యులు
- -జన్మదిన వేడుకలకు దూరంగా ఉన్న కేటీఆర్



హైదరాబాద్, జూలై 24 (మనప్రజాప్రతినిధి): భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, శోభ దంపతులు ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో ఆయనను ఆశీర్వదించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేటీఆర్ కుటుంబ సభ్యులతో కలిసి ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో మొక్కను నాటారు. మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ పిలుపు మేరకు గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌కు సంఘీభావం తెలుపుతూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఈ సందర్భంగా సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో కేటీఆర్ సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షు, కుమార్తె రియాన్షి, ఇతర కుటుంబ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు స్వీకరించి పెద్దల ఆశీస్సులు తీసుకున్నారు. ఇదిలా ఉండగా, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఉద్యమిస్తున్న యువతకు మద్దతుగా, వారిపై జరుగుతున్న చర్యలను నిరసిస్తూ ఈ ఏడాది తన జన్మదిన వేడుకలకు దూరంగా ఉండాలని కేటీఆర్ నిర్ణయించుకున్నారు. ఈ మేరకు వ్యక్తిగత వేడుకలు నిర్వహించకుండా ఉద్యమాలకు సంఘీభావం ప్రకటించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఆ సందర్భంగా నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేసినట్లు బీఆర్ఎస్ పేర్కొంది. కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని పలుచోట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రక్తదాన శిబిరాలు, మొక్కల నాటడం, పేదలకు ఆహార పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు



# ట్రాఫిక్ బ్యూరో ఏర్పాటుకు సీఎం ఆదేశం



- -రోడ్డు భద్రతపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- -ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సంస్థాగత వ్యవస్థపై దృష్టి
- -స్మార్ట్ సిగ్నలింగ్, ఓఆర్ఆర్ భద్రతకు ఆదేశాలు

2

# యువతే దేశ భవిష్యత్తు కేటీఆర్

- -విద్యార్థుల ఉద్యమానికి బీఆర్ఎస్వీ సంఘీభావం
- -ఇందిరాపార్క్‌లో నిరసనలో పాల్గొన్న కేటీఆర్
- -యువశక్తిని తక్కువ అంచనా వేయొద్దని హెచ్చరిక




హైదరాబాద్, జూలై 24 (మనప్రజాప్రతినిధి): దేశ రాజధాని ఢిల్లీలో కొనసాగుతున్న విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై విద్యార్థులకు మద్దతు ప్రకటించారు. తన పుట్టినరోజు వేడుకలను రద్దు చేసుకుని నల్లచొక్కా ధరించి నిరసనలో పాల్గొన్న ఆయన, యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆకాంక్షలను గౌరవించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ యువతే దేశ 2

# భారత్ అభివృద్ధిలో భాగస్వాములు కండి రాష్ట్రపతి

మెదటి పేజీ తరువాయి




పరిశ్రమలు అంతర్జాతీయ పెట్టుబడిదారులకు విశేష అవకాశాలు అందిస్తున్నాయని రాష్ట్రపతి తెలిపారు. రొమేనియా సంస్థలు భారత అభివృద్ధి గాథలో చురుకుగా భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఇరు దేశాల పరిశ్రమలు పరస్పర సహకారంతో కొత్త రంగాల్లో భాగస్వామ్యాలను ఏర్పరచుకుంటే ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. భారత్, రొమేనియా మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలు పరస్పర విశ్వాసానికి నిదర్శనమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈ బలమైన సంబంధాలను ఆధారంగా చేసుకుని వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, ఆవిష్కరణలు, విద్య, పరిశ్రమల రంగాల్లో మరింత విస్తృత సహకారాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు దేశాల ప్రభుత్వాలు, పారిశ్రామిక రంగాలు కలిసి పనిచేస్తే పరస్పర ప్రయోజనాలను మరింతగా విస్తరించవచ్చని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా సుస్థిర అభివృద్ధిని సాధించడంలో భారతదేశం కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. పారదర్శక విధానాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం, వేగవంతమైన ఆర్థిక సంస్కరణలతో భారత్ ప్రపంచ పెట్టుబడి దారులకు విశ్వసనీయ గమ్యస్థానంగా ఎదుగుతోందని వివరించారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ రొమేనియా పరిశ్రమలు భారతదేశంలో తమ పెట్టుబడులను విస్తరించాలని కోరారు. భారత్‌రొమేనియా వ్యాపార వేదిక సమావేశం ఇరు దేశాల మధ్య ఆర్థిక సహకారానికి కొత్త దిశను చూపుతుందని రాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు. వాణిజ్య సంబంధాలు, సాంకేతిక భాగస్వామ్యాలు, పరిశ్రమల మధ్య ప్రత్యక్ష అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా రెండు దేశాల అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ఈ సమావేశం ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆమె అన్నారు

# కాంగ్రెస్ పాలనపై హరీశ్‌రావు విమర్శలు

మెదటి పేజీ తరువాయి



యాదాద్రి భువనగిరి, జూలై 24 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరాలో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. ఆలేరు నియోజకవర్గం బొమ్మలరామారం మండలంలోని సోలేపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, విద్యుత్ సరఫరా వివరాలను పరిశీలించి అనంతరం మీడియాతో మాట్లాడారు. సబ్‌స్టేషన్ లాగ్‌బుక్‌ను పరిశీలించగా రైతులకు గతంలో ఇచ్చిన విద్యుత్ సరఫరా గంటలను తగ్గించి ప్రస్తుతం రోజుకు 12 గంటలు మాత్రమే ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు సిబ్బంది తెలిపారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వం చెబుతున్న 12 గంటల సరఫరాలో కూడా పలుమార్లు ట్రిప్పింగ్ జరుగుతోందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.బొమ్మలరామారంలో మహిళలు రెండు రోజులకు ఒకసారి మాత్రమే తాగునీరు వస్తోందని తనకు విన్నవించుకున్నారని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ హయాంలో మిషన్ భగీరథ ద్వారా నిరంతర తాగునీరు అందించామని, ప్రస్తుతం ఉన్న వ్యవస్థను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థంగా నిర్వహించలేకపోతోందని ఆరోపించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడమే బీఆర్ఎస్ విధానమని హరీశ్‌రావు అన్నారు. విద్యుత్ కోతల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులు సబ్‌స్టేషన్ల ఎదుట ఆందోళనలు చేస్తున్నారని పేర్కొన్నారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలిచిపోవడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ, ఇతర ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. రైతు బీమా కింద అర్హులైన కుటుంబాలకు పరిహారం అందడం లేదని, వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి సంబంధించిన అన్ని పథకాల అమలుపై ప్రభుత్వం తక్షణమే సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల్లో నిలిచిపోయిన విద్యుత్ ఉత్పత్తిని వెంటనే పునరుద్ధరించి రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని హరీశ్‌రావు కోరారు. అలాగే మిషన్ భగీరథ పథకంపై సమగ్ర సమీక్ష నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ప్రతిరోజూ తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

# డీఏవీ హైస్కూల్‌ను ప్రారంభించిన భట్టి

మెదటి పేజీ తరువాయి



మణుగూరు, జూలై 24 (మన ప్రజా ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డీఏవీ హైస్కూల్‌ను ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల భవనాన్ని పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ నాణ్యమైన విద్యే సమాజ ప్రగతికి బలమైన పునాదని అన్నారు. ప్రతి విద్యార్థికి ఉత్తమ విద్యా అవకాశాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్యాసంస్థలను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. విద్యా మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన అభ్యాస వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య విద్యా అవకాశాల్లో అంతరాన్ని తగ్గించే దిశగా చర్యలు చేపడుతున్నామని వివరించారు.భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యాసంస్థలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విద్యార్థుల్లో విజ్ఞానం, నైపుణ్యాలు పెంపొందించే విధంగా విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. డీఏవీ హైస్కూల్ ప్రారంభంతో భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పరిసర ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రానుంది. ఆధునిక సదుపాయాలతో కూడిన ఈ పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడుతుందని అధికారులు తెలిపారు. పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు. నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అందరూ సహకరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

# ఖమ్మం తాగునీటిపై అప్రమత్తంగా ఉండాలి

మెదటి పేజీ తరువాయి



ఖమ్మం, జూలై 24 (మన పజా ప్రతినిధి): ఖమ్మం జిల్లా ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శు క్రవారం ఏన్కూర్ రెగ్యులేటర్ వద్ద సీతారామ ప్రాజెక్టు నుంచి నాగార్జునసాగర్ ఎడమ కాలువలోకి విడుదలవుతున్న గోదావరి జలాల ప్రవాహాన్ని పరిశీలించిన ఆయన, అధి కారులతో పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'ఎల్ నినో' ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నప్పటికీ జిల్లాలోని ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా విడుదలవుతున్న గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు నిరంతర తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలకు ముందస్తుగా నీటి సరఫరా ప్రణాళికలు సిద్ధం చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని భట్టి విక్రమార్క అన్నారు. జల వనరుల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.ప్రజలకు నిరంతర తాగునీటి భద్రత కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా ముందస్తు ప్రణాళికలతో సమస్యలను అధిగమించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. జలాల ప్రవాహ పరిశీలన సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. తాగునీటి అవసరాలపై నిరంతర సమీక్ష నిర్వహిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు కొనసాగించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.

# ట్రాఫిక్ బ్యూరో ఏర్పాటుకు సీఎం ఆదేశం

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, జూలై 24 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక బ్యూరోను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ వ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసి, శాస్త్రీయ విధానాలతో పనిచేసే సంస్థాగత నిర్మాణంతో ఈ బ్యూరోను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ప్రతి రెండు లేదా మూడు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ట్రాఫిక్ వ్యవస్థలో కేవలం నిబంధనల అమలుకే పరిమితం కాకుండా క్రమబద్ధీకరణకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. వాతావరణ పరిస్థితులు, కార్యాలయాల పనివేళలు, రద్దీ సమయాలు, స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిర్వహణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.కొత్తగా రహదారులు, మౌలిక సదుపాయాలు నిర్మించే ముందు ట్రాఫిక్ అధ్యయనం తప్పనిసరిగా నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాలను నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అక్కడ ఇష్టానుసారంగా వాహనాలు నిలపకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నగరంలో స్మార్ట్ సిగ్నలింగ్ విధానంపై సమగ్ర అధ్యయనం చేసి అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సాధ్యమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లు నిర్మించి సిగ్నల్ ఫ్రీ రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు. సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణలో ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన రవాణా వ్యవస్థను అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ట్రాఫిక్ నిర్వహణలో దీర్ఘకాలిక ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు పి. సుదర్శన్ రెడ్డి, కె. రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను

# యువతే దేశ భవిష్యత్తు కేటీఆర్

మెదటి పేజీ తరువాయి



భవిష్యత్తు అని స్పష్టం చేశారు. నేటి తరం ఆలోచనలు, అభిప్రాయాలు, పోరాట స్ఫూర్తిని ఎవరూ తక్కువ అంచనా వేయకూడదన్నారు. జెన్‌జెడ్ తరం సామాజిక మాధ్యమాల ద్వారా తమ స్వరాన్ని దేశవ్యాప్తంగా వినిపిస్తోందని, ప్రజాస్వామ్యంలో యువత అభిప్రాయాలకు అత్యంత ప్రాధాన్యం ఉండాలని పేర్కొన్నారు. నేపాల్‌లో యువత ఉద్యమాల ప్రభావంతో ప్రభుత్వంలో మార్పులు చోటుచేసుకున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, యువశక్తిని నిర్లక్ష్యం చేయడం ఏ ప్రభుత్వానికైనా మంచిది కాదని వ్యాఖ్యానించారు.సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన దీక్షకు ప్రధాన స్రవంతి మీడియా తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని కేటీఆర్ ఆరోపించారు. అయినప్పటికీ విద్యార్థులు సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని తమ సమస్యలను దేశ ప్రజలకు తెలియజేస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు ప్రతి పౌరుడి హక్కు అని, వాటిని అణచివేయడం కంటే ప్రజల అభిప్రాయాలను వినడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు వస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు తమను అడ్డుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ విభేదాలను పక్కనబెట్టి విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో యువత పాత్ర ఎంతో కీలకమని, వారి ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు.అత్యాచార కేసుల్లో నిందితులపై చర్యల విషయంలో వివక్ష కనిపిస్తోందని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. ఆ ప్రశ్నలకు అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే వారు ముందుగా యువత ఆవేదనను అర్థం చేసుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిరసన తెలుపుతున్న విద్యార్థుల స్వరాన్ని గౌరవించి వారి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అవసరమైతే మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కూడా విద్యార్థుల ఉద్యమానికి అండగా నిలుస్తారని కేటీఆర్ తెలిపారు. కరోనా సమయంలోనే పిల్లలే దేశ ముఖచిత్రాన్ని మార్చగల శక్తి అని కేసీఆర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. దేశ అభివృద్ధిలో యువత, విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని, వారిలో ఉన్న శక్తి, సామర్థ్యాలను సరైన దిశలో వినియోగిస్తే దేశం మరింత పురోగతి సాధిస్తుందని అన్నారు. విద్యార్థుల ఆకాంక్షలను గౌరవిస్తూ వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే విధానాలను ప్రభుత్వాలు అమలు చేయాలని కేటీఆర్ కోరారు.

# వాణినికేతన్ హై స్కూల్ లో ఘనంగా "మెహందీ ఫెస్ట్"



మన ప్రజాప్రతినిధి/ మనకొండూరు తేదీ 24 జూలై :విద్యార్థులలో భారతీయ సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన మెహందీ ఫెస్ట్ - 2026 ఘనంగా జరిగింది. వాణినికేతన్ హై స్కూల్ ఆవరణలో శుక్రవారం చేతులకు గోరింటాకు మనసుకు సంతోషం అనే నినాదంతో చేపట్టిన కార్యక్రమానికి విద్యార్థినీలు సంప్రదాయ దుస్తులలో హాజరై ఉత్సవంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు, కళలు, సంస్కృతి సాంప్రదాయాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, పోటీత్వాన్ని పెంపొందించడానికి పాఠశాలలో తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు తమదైన శైలిలో వివిధ రీతుల గోరింటాకు డిజైన్లను రూపొందించి పోటీలో ఆసక్తిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీమతి తూముకుంట శ్రీనిధి, ఉపాధ్యాయినీలు సుమంగళి, శోభ, మహాలక్ష్మి, లావణ్య, సునంద, మౌనిక, కళ్యాణి, షమీమా, రేణుకలి, జలజ, శాంత, పద్మ,రేణుక,సునీత, స్వాతి, ఊష, ఉపాధ్యాయులు శ్రీనివాస్,రాజు, సంతోష్, రాజు, రమేష్, తిరుపతి తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు

# యశ్న అన్నప్రాశన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) ఆలేటి రమేశ్ గారి కుమార్తె యశ్న అన్నప్రాశన మహోత్సవం శుక్రవారం కుషాయిగూడలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ శుభకార్యానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చిన్నారి యశ్నకు అన్నప్రాశనం సందర్భంగా ఆశీర్వదించి, ఆమె ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఎదిగి కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మేడ్చల్ డిసిసి ప్రెసిడెంట్ వజ్రేష్ యాదవ్ కు ఆహ్వానం

మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:డంపింగ్ యార్డుపై ఈనెల 26న స్వర్ణాంధ్రా, డిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో జరుగుతున్న సదస్సుకు ఆహ్వానించిన జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటి చైర్మన్ షేక్ షావలి, కోశాధికారి పి. శివబాబు. కాంగ్రెస్ జవహర్ నగర్, చంద్రపురికాలనీ డివిజన్ అధ్యక్షుడు మల్లెపల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో కలువడం జరిగింది. రాంకీ చెత్తడంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఈనెల 26, ఆదివారం రోజున జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య భద్రత, జీవించే హక్కుకై జరుగుతున్న అవగాహన సదస్సుకు డిసిసి మేడ్చల్ జిల్లా ప్రెసిడెంట్ వజ్రేష్ యాదవ్ ను కమిటీ చైర్మన్ షేక్ షావలి, కోశాధికారి పి. శివబాబు ఆహ్వానించారు. కాంగ్రెసు జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలో గల చంద్రపురికాలనీ డివిజన్ అధ్యక్షుడు మల్లెపల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో షేక్ షావలి, శివబాబు లతోపాటు రమేష్ చారి, బూడిద వెంకటేష్ వజ్రేష్ యాదవ్ ను కలిసి ఆహ్వానించిన వారిలో ఉన్నారు.



# కేటీఆర్‌కు ఎన్నికలప్పుడే వార్డులు గుర్తుకొస్తాయా?
## సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు ధ్వజం



మనప్రజాప్రతినిధి/రాజన్నసిరిసిల్ల జూలై, 24 స్థానిక సంస్థల ఎన్నికలు రాగానే బిఆర్ఎస్ నాయకుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కు వార్డులు గుర్తుకొస్తున్నాయా అని సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూర దేవరాజు తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. శుక్రవారం పట్టణంలోని 29, 30, 32 వార్డులలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్డు కమిటీల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్‌లో ఉండే నాయకుడు మనకు అవసరమా? ఈ సందర్భంగా సూర దేవరాజు మాట్లాడుతూ... గతం స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో "వారంలో రెండు రోజులు సిరిసిల్లలోనే ఉండి ప్రజల సమస్యలు తీరుస్తాను" అని కేటీఆర్ ఇచ్చిన హామీని ఇప్పుడు విస్మరించారని మండిపడ్డారు. సిరిసిల్ల పట్టణంలో దాదాపు లక్ష ఓట్లు ఉన్నాయని, వచ్చే ఎన్నికల్లో మన సమస్యలు తెలిసిన స్థానిక నాయకుడినే ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలని కోరారు. "శాసనసభ్యుడిగా గెలిచి హైదరాబాద్‌లో నివాసముండే నాయకుడు మనకు అవసరమా? ప్రజలకు ఏదైనా కష్టం వస్తే ఎవరికి చెప్పుకోవాలి?" అని ప్రశ్నించిన ఆయన, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలపై తక్షణమే స్పందించే వ్యక్తికి రాబోయే ఎన్నికల్లో ఓటేసి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పెద్ద సంఖ్యలో హాజరైన నాయకులు, కార్యకర్తలుఈ వార్డు కమిటీల సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కూరపాటి శ్రీశైలంబూట్ల నవీన్‌భీమవరం శ్రీనివాస్‌దుంపేటి రాకేష్‌బచ్చు ప్రసాద్‌గజ్జెల అశోక్‌గుడిసేటి బాలరాజుసదుల గంగరాజుమోర ప్రసాద్‌కైరంకొండ రాహుల్‌మరియు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేశారు.

# గోదాముల నిర్మాణానికి స్థలాలు పరిశీలించిన జిల్లా కలెక్టర్
## వేములవాడ అర్బన్ మండలం తెట్టకుంట, మారుపాకలో పరిశీలన

మనప్రజాప్రతినిధి/ వేములవాడ, జూలై -24:ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సహకార శాఖ నేతృత్వంలో గోదాముల నిర్మాణానికి వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం సమీపంలోని తెట్టకుంట, మారుపాకలో స్థలాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు. వేములవాడ అర్బన్ మండలం తెట్టకుంట, మారుపాక గ్రామంలో స్థలాలను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సహకార శాఖ నేతృత్వంలో గోదాముల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని, దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని ఆదేశించారు. త్వరితగతిన పనులు మొదలు పెట్టి గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఆర్డీఓ, తహసీల్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్థల పరిశీలన వేములవాడ అర్బన్ మండలం చింతలఠాణ ఆర్ అండ్ ఆర్ కాలనీ వద్ద వేములవాడ ఆర్డీఓ, తహసీల్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణానికి స్థలాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. సర్వే నంబర్, మొత్తం స్థలం విస్తీర్ణం తదితర అంశాలపై రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగతా పనులు పూర్తి చేసి.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.



# మార్కెట్ కమిటీ డైరెక్టర్ ను పరామర్శించిన చైర్మన్ వెంగళ్ రావు

మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జులై 24:చేగుంట మండల మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాషాబోయిన శ్రీనివాస్ గత కొన్ని రోజుల నుండి ఆరోగ్యం బాగా లేక పోవడం తో విషయం తెలుసుకున్న చేగుంట మార్కెట్ కమిటీ చైర్మన్ తాడేం వెంగళ్ రావు, శుక్రవారం వారం రాంపూర్ లోని తన స్వగృహం లొ కలిసి, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇచ్చారు, ఈ కార్యక్రమం లొ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.



# మానస చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో ఐదుగురు సభ్యుల కమిటీ తనిఖీ
## అధిక ఫీజుల ఆరోపణలపై కలెక్టర్ ఆదేశాలతో రికార్డుల పరిశీలన

మనప్రజాప్రతినిది/రాజన్నసిరిసిల్ల జూలై, 24రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మానస చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో రోగుల నుంచి భారీగా వైద్య ఛార్జీలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపై యంత్రాంగం వేగంగా స్పందించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల నిపుణుల కమిటీ శుక్రవారం సదరు ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న చికిత్స విధానాలు, ఇప్పటివరకు జారీ చేసిన బిల్లులు, వసూలు చేసిన రుసుములు, కేస్ షీట్లు మరియు సంబంధిత వైద్య రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి, అధిక ఛార్జీల వసూలుపై ఆరా తీశారు. తనిఖీ అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ... ఆసుపత్రిలోని రికార్డులు మరియు ఇతర వివరాలను సేకరించామని తెలిపారు. పరిశీలించిన అన్ని అంశాలపై క్షుణ్ణంగా సమగ్ర నివేదిక తయారు చేసి, తదుపరి చర్యల కోసం జిల్లా అధికారులకు త్వరలోనే సమర్పిస్తామని వెల్లడించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి (డిప్యూటీ డీఎంహెచ్ఓ) డా. నాగేందర్ బాబు, డా. సౌమ్య, డా. పూర్ణచందర్, డా. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# బి.ఎన్.ఆర్.కె.ఎస్. ఆధ్వర్యంలో పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ

మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి కో కన్వీనర్ సూర వెంకటయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమం. ఎన్జీవో సంఘం శంకర్ ఆధ్వర్యంలో వికలాంగూల కాలనీలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ. ఆరోగ్యవంతమైన సమాజనిర్మాణాన్ని దెబ్బతీసే రాంకీ చెత్తడంపింగ్ యార్డుకు. వ్యతిరేకంగా ఈనెల 26, ఆదివారం రోజు, స్వర్ణాంధ్రా, డిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగే సదస్సును జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, జవహర్ నగర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాటకమిటి కో కన్వీనర్, బి.ఎన్.ఆర్.కె.ఎస్. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర వెంకటయ్య అధ్యక్షతన పోస్టర్, కరపత్రాలను గబ్బిలాలపేటలో ఆవిష్కరించారు. 2026, జూలై-24, శుక్రవారం రోజు కీసర సర్కిల్, జవహర్ నగరంలో జీహెచ్ఎంసీ, గబ్బిలాలపేటలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎ.లింగేజి, షంషుద్దీన్, సిపిఐ కె.కుర్మయ్య, సిహెచ్ ఎల్లయ్య, కె.కుమార్, కె.సూర్యం, శ్యామ్ ధాన్, బి.ఎన్.ఆర్.కె.ఎస్. సూరశ్రీను, ఆంద్రాశ్రీను, ఆటో కుమార్, రాకీ, పి.దత్తు, డి.వెంకటేష్, సిహెచ్ కృష్ణ, రాజు తదితరులు ఈపై కార్యక్రమంలో పాల్గొన్నారు. వికలాంగుల కాలనీలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఎన్జీవో నేత శంకర్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి, కో కన్వీనర్, పిఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునీత, రజిత పై కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఉన్నారు.



# విద్వేష రెచ్చగొట్టే చర్యలు, విద్యార్థులపై లాఠీ చార్జి దుర్మార్గం



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ప్రెసిడెంట్ మహ్మద్ పాషామీయా.జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ కార్యదర్శి టి.కాలేషా అధ్యక్షతన జరిగిన సమావేశం.ఇటీవల బీ.ఆర్.కె. న్యూస్ డిబెట్ లో విజయవిహారం, జై భారత్ నేత, రమణమూర్తిపై కష్యపు రెడ్డి అనే ఆర్ఎస్ఎస్ మతోన్మాది చెప్పుతో జరిపిన దాడిని మరియు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీసు లాఠీచార్జిని జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటి అధ్యక్షుడు మహ్మద్ పాషామీయా తీవ్రంగా ఖండించారు. 2026, జూలై-24, కీసర సర్కిల్, జవహర్ నగరంలో జీహెచ్ఎంసీ, దేవేందర్ నగర్ లో కమిటీ సమావేశం టి.కాలేషా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పాషామీయా ప్రసంగిస్తూ, శాంతి యుతంగా పరీక్ష పేపర్ల లీకేజీపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు, విద్యార్థినీలపై మరియు మహిళా జర్నలిస్ట్ పై బీజేపీ, ఆర్ఎస్ఎస్, పోలీసులు అనుసరించిన అనుచిత ప్రవర్తన దుర్మార్గం, అమానుషం, అప్రజాస్వామికం అని మండిపడ్డారు. ఖండవారంతో సభ్యసమాజం తలదించుకునేలా విద్వేష, రెచ్చగొట్టే, వెకిలి చేష్టల చర్యలు మరియు లాఠీచార్జి కేంద్రంలోని బీజేపీ ప్రధాని నరేంద్రమోదీ, అమిత్ షాల ప్రభుత్వానికి సిగ్గుచేటని అన్నారు. లక్షలాది మంది పిల్లల జీవితాలను వీధిన పడేసిన అవినీతి కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రను రాజీనామా చేయాలని విద్యార్థిలోకం ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులను వెంటాడి, వేటాడి, రబ్బరు బుల్లెట్లతో కాల్పులు, టియర్ గ్యాస్ ప్రయోగించడం, లాఠీలకు మేకులు కొట్టి రక్తం వచ్చేలా కొట్టడం లాంటి చర్యలు ఎందరో విద్యార్థి, విద్యార్థుల తల్లి దండ్రులను కంటతడి పెట్టించాయని గుర్తుచేశారు. ఇప్పటికైన విద్యామంత్రిని భర్తరఫ్ చేసి, నిరసన కార్యక్రమంలో నష్టపోయిన విద్యార్థులను అన్నివిధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయమూర్తుల చేతుల్లో ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుందని అనుకునే పరిస్థితి నుండి, ఒకరిద్దరు న్యాయ మూర్తులు చేసే అభ్యంతకరమైన వాఖ్యలు, న్యాయం కోసం కోట్లు మెట్లెక్కిన బాదిత విద్యార్థుల పిటిషన్ల తిరస్కణ ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేసేలా మాట్లాడడం బాదాకరమని ఆవేదన చెందారు. సైయద్ ముబషీర్, మహ్మద్ వాహేద్, మొయినుద్దీన్, జావేద్, సైయద్, షేక్ ముర్తుజా, హైదర్, అజ్మతుల్ హైదర్, మౌలానా, ఆరీఫ్ సాబ్, మహ్మద్ ఆర్మన్, ఇమ్రాన్, సఫీ తదితరులు పై సమావేశంలో పాల్గొన్నారు.

# యువత స్వసక్తి తో ఎదగాలి చెరుకు శ్రీనివాస్ రెడ్డి...



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూలై 24,:చేగుంట పట్టణ కేంద్రం లో రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నవీన్ కుమార్, భాస్కర్, మెదక్ రోడ్డు లో నూతనంగా ఏర్పాటు చేసిన మెడ్ ప్లేస్ మెడికల్ షాప్ ను , దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంగల్ రావు, మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్,చేగుంట సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, వడియారం సర్పంచ్ సాయికుమార్, శుక్రవారం కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ చదువుకున్న యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వసక్తితో ఎదగడం ముఖ్యమని నలుగురికి ఉపాధి అవకాశం కల్పించి జీవించడంలో ఆనందం ఉంటుందని తెలిపారు. పట్టణ ప్రజలకు మందులు తక్కువ ధరలో అందుబాటులో ఉంటాయని, డోర్ డెలివరీ సదుపాయం కూడా అందుబాటులో ఉన్నదని, పట్టణ, పరిసరాల ప్రజలు వీటిని ఉపయోగించుకోవాలని,షాప్ యజమాని నవీన్ కుమార్, భాస్కర్ తెలిపారు,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మసాయిపేట్ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ ముజామిల్, కాషాబోయిన శ్రీనివాస్, బల్ రెడ్డి, స్టాలిన్ నర్సిములు,పలువురు ఉపసర్పంచ్ రఫీ, చౌదరి శ్రీనివాస్,, వార్డు సభ్యులు మండల నాయకులు సంద్రుగు శ్రీకాంత్, రాజా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ప్రతిష్ఠాత్మక "వైద్యరత్న నేషనల్ అవార్డు 2026"



మనప్రజాప్రతినిధి అక్బర్ భూంపల్లి మండల్. సిద్దిపేట జిల్లా "వైద్యో నారాయణో హరి" అన్న మాటకు నిలువెత్తు నిదర్శనం డాక్టర్ హేమరాజ్ సింగ్"దుబ్బాక, జూలై 23: "వైద్యో నారాయణో హరి" అనే నానుడికి నిజమైన అర్థాన్ని ఆచరణలో చూపిస్తూ ప్రజలకు అంకితభావంతో వైద్య సేవలు అందిస్తున్న సిద్ధిపేట జిల్లా దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ ప్రతిష్ఠాత్మక లి"వైద్యరత్న నేషనల్ అవార్డు 2026"లికు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని బహుజన సాహిత్య అకాడమీ (దీూా) జాతీయ అవార్డు సెలెక్షన్ కమిటీ అధికారికంగా ప్రకటించింది.వైద్య రంగంలో విశిష్ట సేవలు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి అందించిన విశేష కృషి, పేద నిరుపేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో చూపిన అంకితభావాన్ని గుర్తిస్తూ ఈ అత్యున్నత జాతీయ పురస్కారానికి డాక్టర్ హేమరాజ్ సింగ్‌ను ఎంపిక చేసినట్లు కమిటీ పేర్కొంది.హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అవార్డు సెలెక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ హనుమాన్లు విష్ణు, సిద్ధిపేట జిల్లా సెలెక్షన్ కమిటీ సభ్యులు గుర్రాల శ్రీనివాస్, కుంబాల రవీందర్ ఆధ్వర్యంలో డాక్టర్ హేమరాజ్ సింగ్ పేరును ఖరారు చేశారు. అనంతరం బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అధికారిక ఆహ్వాన పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ, సమాజ సేవ, వైద్య సేవలు, విద్య, సాహిత్యం, సామాజిక చైతన్యం, ప్రజా సంక్షేమం వంటి రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వ్యక్తులను గుర్తించి ప్రతి సంవత్సరం జాతీయ అవార్డులను ప్రదానం చేస్తున్నామని తెలిపారు. సమాజానికి ఆదర్శంగా నిలిచే సేవలను గౌరవించడం ద్వారా మరింత మంది సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ప్రోత్సహించడమే అకాడమీ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ నెల జూలై 26, 2026న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బహుజన సాహిత్య అకాడమీ 19వ నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగా డాక్టర్ హేమరాజ్ సింగ్‌కు లి"వైద్యరత్న నేషనల్ అవార్డు 2026"లిను ఘనంగా ప్రదానం చేయనున్నారు. ఈ సదస్సుకు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, గోవా రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు.డాక్టర్ హేమరాజ్ సింగ్ దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆసుపత్రిలో వైద్య సేవల విస్తరణ, రోగులకు సకాలంలో నాణ్యమైన చికిత్స అందించడం, అత్యవసర వైద్య సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించడం, వైద్యులు సిబ్బందితో సమన్వయం సాధిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో విశేష కృషి చేస్తున్నారు. అలాగే ఆసుపత్రిలో పరిశుభ్రత, మౌలిక సదుపాయాల మెరుగుదల, పేద నిరుపేద రోగులకు మానవతా దృక్పథంతో సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.వైద్య వృత్తిని సేవగా భావించి ప్రజారోగ్య పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న డాక్టర్ హేమరాజ్ సింగ్‌కు ఈ ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డు లభించడం దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి, అక్కడి వైద్య సిబ్బందికి, దుబ్బాక ప్రాంత ప్రజలకు గర్వకారణమని పలువురు ప్రజాప్రతినిధులు, వైద్యులు, సామాజికవేత్తలు, వివిధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# రాజకీయాల్లో విలువలు ఉండాలిచంద్రబాబు




**-రంపచోడవరంలో మెగా పీటీఎంలో ముఖ్యమంత్రి ప్రసంగం**
**-విద్య, సంక్షేమం, అభివృద్ధిపై ప్రభుత్వ లక్ష్యాల వివరణ**
**-విమర్శలకు సీఎం చంద్రబాబు ఘాటు సమాధానం**

రంపచోడవరం, జూలై 24 (మనప్రజాప్రతినిధి): పోలవరం జిల్లా రంపచోడవరంలో నిర్వహించిన మెగా పేరెంట్‌టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజకీయాలు, విద్య, సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి అంశాలపై ఆయన మాట్లాడారు. తల్లిని, సొంత చెల్లిని గౌరవించని వారు సమాజానికి మేలు చేయలేరని, అలాంటి వ్యక్తులు రాజకీయాల్లో ఉండటానికి అనర్హులని వ్యాఖ్యానించారు. కనీస విలువలు లేని వారు రాజకీయాల్లో కొనసాగడం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అరాచకాలు జరిగాయని ముఖ్యమంత్రి ఆరోపించారు. రంపచోడవరం నియోజకవర్గంలో దళిత డ్రైవర్ హత్య ఘటనను ప్రస్తావిస్తూ, అలాంటి ఘటనలను ప్రజలు మరవకూడదన్నారు. మంచి పనులను ప్రోత్సహించి, చెడును నిలదీసినప్పుడే సమాజంలో మార్పు వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమి ప్రభుత్వం పనిచేస్తుంటే, కొందరు బురదజల్లే రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మెగా డీఎస్సీ నియామకాలపై విమర్శలు చేయడం ద్వారా కొత్తగా నియమితులైన ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని అన్నారు.పిల్లలకు తల్లిదండ్రులు ఇవ్వగలిగే గొప్ప ఆస్తి చదువేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసమే విద్యాశాఖలో సమూల మార్పులు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరగడంతో ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు లక్షా పది వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్‌టీచర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతాల విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని, వారికి సరైన అవకాశాలు కల్పిస్తే గొప్ప విజయాలు సాధిస్తారని పేర్కొన్నారు. హాస్టళ్లు, గురుకులాల్లో ఆహార వ్యయాన్ని పెంచడంతో పాటు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉన్నత స్థాయి శిక్షణ అందిస్తున్నామని వివరించారు.రాష్ట్రం భారీ అప్పుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలను ఆపలేదని ముఖ్యమంత్రి తెలిపారు. 'తల్లికి వందనం' పథకం కింద నిధులను తల్లుల ఖాతాల్లో జమ చేశామని, ప్రతి నెల ఒకటో తేదీన పెన్షన్లు అందిస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి హామీలను అమలు చేస్తున్నామని, ఆగస్టు నుంచి 'సంజీవని' ఆరోగ్య పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సభలో పలువురు విద్యార్థులు తమ లక్ష్యాలు, ఆశయాలను వివరించగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వారిని అభినందించారు. భవిష్యత్తులో ఐఏఎస్ అధికారి కావాలన్న ఆకాంక్ష వ్యక్తం చేసిన విద్యార్థి సాత్విక్‌ను ప్రత్యేకంగా అభినందించిన ముఖ్యమంత్రి, పెద్ద కలలు కనాలని, వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. అలాగే పిల్లలతో నిరంతరం సంభాషిస్తూ వారి ఆలోచనలు, అభిరుచులను ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

# మంత్రి రాజీనామాపై రాహుల్ పట్టుబాటు



న్యూఢిల్లీ, జూలై 24 (మనప్రజాప్రతినిధి): నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు లోక్‌సభలో ఎలాంటి చర్చలకు అంగీకరించబోమని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం స్పష్టం చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించిన తర్వాతే తదుపరి చర్చలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. విపక్షాల ఆందోళనల నడుమ లోక్‌సభ వాయిదా పడిన అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ, పేపర్ లీకేజీల అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సభలో ప్రకటించారు. పేపర్ లీక్‌లను అరికట్టేందుకు కఠిన చట్టాలు తీసుకొస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇప్పటికే హామీ ఇచ్చారని పేర్కొంటూ, చర్చకు సహకరించాలని విపక్షాలను కోరారు.ఆ తర్వాత పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, సభలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, తన మైక్‌ను లాగేసుకున్నారని ఆరోపించారు. విద్యార్థుల తరఫున విపక్షాలు మూడు ప్రధాన డిమాండ్లు చేస్తున్నాయని చెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిరసన తెలిపిన విద్యార్థులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ప్రధానమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి పదవిలో కొనసాగుతున్నంత వరకు ఎలాంటి చర్చల్లో పాల్గొనబోమని రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. ఈ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి నీట్-యూజీ పరీక్ష పత్రాల లీకేజీ అంశం పార్లమెంట్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పేపర్ లీక్‌లను నిరోధించేందుకు ఇప్పటికే కొత్త చట్టాన్ని

